## క్లుప్తంగా

### ఘనంగా అడెమ్మ తల్లి గ్రామోత్సవం



**అద్దేపల్లి(భట్టిప్రోలు):** అద్దేపల్లి గ్రామదేవత శ్రీ అడెమ్మ అమ్మవారిని పులి వాహనంపై ప్రతిష్ఠించి బుధవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి దివ్య నీరాజనాలు పలికారు. కనక తప్పెట్లు, మేళ తాళాల మధ్య అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు అమ్మవారికి పండ్లు, పూలు, టెంకాయలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఉగాది పర్వదినం మంగళవారం రావడంతో అమ్మవారికి బుధవారం గ్రామోత్సవం గావించినట్లు నిర్వాహకులు తెలిపారు.

### ముస్లింలకు వరికూటి రంజాన్ శుభాకాంక్షలు

**భట్టిప్రోలు:** ముస్లిం సోదరులకు వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ దయతో ముస్లిం కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలతో తుల తూగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటువంటి పండుగలు రానున్న రోజుల్లో మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### ఉపాధి సిబ్బందితో సమీక్ష

**వేమూరు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీవో జి వి శేష గిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డుల అఫ్డేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఎండా కాలంలో కూలీలకు పని ప్రదేశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్య కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ గెలుపుకు నాంది

**నడిగడ్డవారి పాలెం(వేమూరు):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ గెలుపుకు నాంది కాబోతున్నాయని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తనయుడు వరికూటి తేజస్ అన్నారు. చుండూరు మండలంలోని నడిగడ్డ పాలెం గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిందన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ గెలుపుకు నాంది పలకనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీత సురేష్, సతీష్, రమేష్, రామారావు, రాజేష్, నాని, సన్నీ, క్రాంతి, మార్తమ్మ, నాగరాజు, అన్నమ్మ, జక్రయ్య పాల్గొన్నారు.

### అక్రమ మద్యం సరఫరాపై నిఘా పెంచాలి

సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు



**రేపల్లె రూరల్:** అక్రమ మద్యం సరఫరా నివారణకు సెబ్ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాసులు ఆదేశించారు. పట్టణంలోని సెబ్ కార్యాలయంలో సోమవారం ఆయన సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం సరఫరాపై సిబ్బంది ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలన్నారు. మద్యం అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందితే దాడులు నిర్వహించి వాహనాలను సీజ్ చేయాలన్నారు. నిందితులు ఎవరైనా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడరాదన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు జ్యోతిబా పూలే జయంతి నిర్వహణ

**రేపల్లె రూరల్:** పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమం నిర్వహించబడునని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావులు పాల్గొనే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# ‘వైఎస్సార్ సీపీ గెలుపుతో కూటమి కనుమరుగు’

- వలంటీర్లపై కపట ప్రేమ ఒలకబోస్తున్న చంద్రబాబు
- ఆయనకు ఇవే చివరి ఎన్నికలు
- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

**చెరుకుపల్లి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన ‘సిద్ధం’ సభలకు, ప్రస్తుతం నిర్వహిస్తున్న ‘మేము సిద్ధం’ బస్సు యాత్రలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని ఇంతటి ప్రజాదరణ కలిగిన నాయకుడు దేశ చరిత్రలో జగన్ ఒక్కరే అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. బుధవారం బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతటి ప్రజాదరణ కలిగిన నాయకుడు కాబట్టే మళ్లీ రెండో పర్యాయం ముఖ్యమంత్రిని చేసి ప్రమాణ స్వీకారం చేయించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు అంతా ఏకమయ్యారని, ఎంతమంది కలిసినా జగనన్నకు ప్రజల ఆశీస్సులు, దేవుడి దీవెనలు మెండుగా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రజలు జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందారని మరోమారు ఆయన ముఖ్యమంత్రి అయితే మరిన్ని పథకాలు అందుతాయనే విశ్వాసంతో ఉన్నారని మోపిదేవి తెలిపారు. రాష్ట్రంలో వలంటీర్లను అవమాన పరిచిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మేము అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తాం అని కొత్తరాగం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎన్ని వాగ్దానాలు చేసినా ప్రజలు నమ్మరని చంద్రబాబుకి ఇదే చివరి ఎన్నికలని విమర్శించారు.

# వైఎస్సార్ సీపీలో చేరికలు

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత ప్రభాకరరావు



కూచిపూడిలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత ప్రభాకరరావుతో వరికూటి అశోక్‌బాబు



కర్లపాలెం మండలం పేరలిలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీకి చెందిన యాదవులు

**పేరలి(కర్లపాలెం):** జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి అందుతున్నాయని మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని పేరలి పడమర యాదవ పాలెంకు చెందిన టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం టీడీపీ నాయకులతో పాటు తటస్థులు సుమారు 30 మంది ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ కోన నిఖిల్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యార్థులు, రైతులు, మహిళలు, పేదల కోసం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు ఆర్థిక వనరుగా మారాయని ఆయన పరిపాలన మెచ్చి జగనన్నను బలపరిచేందుకు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో దబ్బుకూటి రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, దబ్బుకూటి రవి, దబ్బుకూటి వెంకటేశ్వర్లు, పిన్నిబోయిన సాహెబ్, మద్దిబోయిన శ్రీనివాసరావు, దబ్బుకూటి శ్రీనివాసరావు, నాగాంజనేయులు తదితరులు ఉన్నారు.

**ఇంటింటి ప్రచారం నిర్వహించిన కోన నిఖిల్**

వైఎస్సార్ సీపీ బాపట్ల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ బుధవారం పేరలి గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే జగన్‌ను సీఎం చెయ్యాలని, నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసుకునేందుకు కోన రఘుపతిని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, సర్పంచ్‌లు మల్లెల వెంకటేశ్వర్లు, అక్కల శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, నాయకులు గొర్రుముచ్చు మీరయ్య, చిరంజీవి, అర్జున్‌రెడ్డి, శివరావు, ధర్మేంద్ర, ఆట్ల నాగేశ్వరరెడ్డి, చీరాల సత్యనారాయణరెడ్డి, కంకిపాటి నాగరాజు, యారం బాబూరావు తదితరులు ఉన్నారు.

**కూచిపూడి(వేమూరు):** చుండూరు మండలానికి చెందిన చినగాదెలవర్రు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది గాజులవర్తి ప్రభాకరరావు బుధవారం కూచిపూడి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కారుమూరిపాలెం గ్రామ సర్పంచ్ ఉయ్యూరి సుబ్బారెడ్డి, ఎంపీపీ జాలాది రూబేను, ఎంపీపీ యల్లమాటి మోహన్, ఉయ్యూరి అప్పిరెడ్డి, శ్రీనివాసరరావు, లంక శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు కోన ఎన్నికల ప్రచారం

**పిట్టలవానిపాలెం:** మండలంలోని గ్రామాలలో గురువారం వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ అభ్యర్థి కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.గురువారం సాయంత్రం 4 గంటలకు పిట్టువారిపాలెం, గోకరాజునల్లి బోయినవారిపాలెం, పిట్టలవానిపాలెం, కొత్తపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

### జేబీపీ వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్యామ్‌ప్రసాద్

**భట్టిప్రోలు:** జై భీమ్‌రావు భారత్ పార్టీ (జేబీపీ) వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా యల్లమాటి శ్యామ్‌ప్రసాద్ పేరును ఆ పార్టీ అధినేత, మాజీ న్యాయమూర్తి జడా శ్రావణ్‌కుమార్ బుధవారం ప్రకటించారు. వేమూరు మండలం వరహాపురానికి చెందిన శ్యామ్‌ప్రసాద్ ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన శ్రావణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి పార్టీ పతాకాన్ని ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రామ్‌జీ పాల్గొన్నారు.

### చెరువుల నిర్వహణకు ప్రత్యేక చర్యలు

**కర్లపాలెం:** మండల పరిధిలో గల తాగునీటి చెరువులను నీటితో నింపి తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్లపాలెం ఎంపీడీవో నేతాజీ తెలిపారు. పంట కాలువలకు నీరు వచ్చిన వెంటనే కర్లపాలెం మండల పరిధిలో గల పెదగొల్ల పాలెం, దుండివారిపాలెం, సమ్మెటవారిపాలెం ,కర్లపాలెం, చింతాయపాలెం, గణపవరం, పేరలి గ్రామాలలో ఉన్న తాగునీటి చెరువులను నింపేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రత్యేక అధికారులుగా నియమించనిట్లు ఎంపీడీవో తెలిపారు.

## కోల్ట్ స్టోరేజీ యజమాని ఆస్తులపై ఆంక్షలు విధించాలి

- విక్రయం, తనఖాకు అవకాశం లేకుండా చూడాలి
- సబ్ కలెక్టర్‌తో పసుపు రైతుల సంఘం నేతల వినతి



ప్రఖర్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

**తెనాలి:** దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్ట్ స్టోరేజీ యజమాని తన ఆస్తులను విక్రయించకుండా, తనఖా పెట్టకుండా సబ్ రిజిస్ట్రార్‌కు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం నాయకులు కోరారు. ఆ ప్రకారం బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యజమాని నిర్లక్ష్యం కారణంగా కోల్ట్ స్టోరేజీలోని రూ.120 కోట్ల పసుపు పంట దగ్ధమైందని తెలిపారు. కోల్ట్ స్టోరేజీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు మేరకు క్వింటాలుకు రూ.12,500 ఇప్పించేలా చూడాలన్నారు. ముందుగా నష్టపోయిన రైతులకు బీమా పరిహారం చెల్లించి, యజమానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బోగస్ రైతులకు కాకుండా నిజంగా నష్టపోయిన రైతులకే పరిహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ రైతులు, కోల్ట్ స్టోరేజీ యజమానికి సమావేశం ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తానని చెప్పారు. కోల్ట్ స్టోరేజీ అగ్నిప్రమాదంపై ఇంకా రెండు శాఖలకు చెందిన నివేదికలు రావాల్సి ఉందని, రైతాంగం అభిప్రాయాలను కలెక్టరు దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. బాపట్ల జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, గద్దె శ్రీహరి, నాదెళ్ల చంద్రశేఖర్, మందాళ ప్రదీప్‌రెడ్డి, కళ్లం శ్రీనివాసరెడ్డి, యు.హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## నేటి నుంచి సువార్త ఉజ్జీవ మహాసభలు

**గుంటూరు రూరల్:** ప్రపంచ శాంతి కోసం క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ ప్రతి ఏటా కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించే 18వ వార్షిక సువార్త ఉజ్జీవ మహాసభలు ఈనెల 11వ తేదీనుంచి ప్రారంభించనున్నట్లు కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. బుధవారం నల్లపాడు రోడ్డు హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎదురుగా గల మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమై 12, 13, 14వ తేదీ ఆదివారం రాత్రి వరకూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ ప్రత్యేక ప్రార్థనల్లో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు పాల్గొంటారని చెప్పారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనే విశ్వాసులకు భోజనం, వసతి ఏర్పాట్లు సిద్ధం చేశారన్నారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనలకు, పగటిపూట ప్రత్యేక ప్రార్థనలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పగటి పూట ప్రార్థనలకు ప్రత్యేకంగా చలువ పందిళ్ళు, తాగు నీరు, వసతి, భోజనం, స్నానపు గదులు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా నిర్వహించే దేశ, రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రీస్తు స్తుతిగీతాల ఆలాపనలు, పాటల సీడీల ఆవిష్కరణ జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ సీనియర్ పాస్టర్ డేవిడ్ రాజు, బ్రదర్ హోసన్న, పాస్టర్లు తిమోతి, మోషే తదితరులు పాల్గొన్నారు.

### వాహన తనిఖీల్లో రూ. లక్ష స్వాధీనం

**ప్రత్తిపాడు:** వాహన తనిఖీల్లో భాగంగా రూ. లక్ష స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేట మల్లయ్య సెంటరుకు చెందిన అతుకూరి ప్రసాద్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి రశీదులు లేకుండా తన కారులో రూ.లక్ష తీసుకువెళుతున్నాడు. అదే సమయంలో ప్రత్తిపాడు మండలం, నడింపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపైనున్న అంతర్‌జిల్లా పోలీస్ చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు కారులో నగదును గుర్తించారు. ఈ మేరకు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### బ్లేడుతో భార్య గొంతు కోసిన భర్త



**పెదకాకాని:** కోర్టు పరిధిలో ఉన్న కేసును ఉపసంహరించుకోలేదనే కోపంతో భర్త బ్లేడుతో భార్య గొంతు కోసిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షామీర్ అదే ప్రాంతానికి చెందిన తస్లీమ్‌ను ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి సంవత్సరం వయసున్న బాబు ఉన్నాడు. వివాహమైన కొద్ది రోజులకే షామీర్ వేధింపులు భరించలేని భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గృహహింస, వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. ప్రస్తుతం ఇద్దరూ పుట్టింటికీ, అత్తంటికీ దూరంగా ఇల్లు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. షామీర్ తరచూ భార్యను కేసు ఉప సంహరించుకోవాలని ఒత్తిడి తెస్తున్నాడు. కేసు ఉప సంహరించుకుంటే గతంలో మాదిరిగా వేధింపులకు గురిచేస్తాడని ఆమె అందుకు నిరాకరించింది. దీంతో షామీర్ బుధవారం ఒక పథకం ప్రకారం బ్లేడుతో భార్య గొంతు కోశాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం రక్తస్రావం అవుతున్న తస్లీమ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు సయ్యద్ షామీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

# సంక్షేమ సారథికి పట్టం కడదాం

**చింతమోటు(భట్టిప్రోలు):** అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు తనయుడు శ్రీ తేజస్ పేర్కొన్నారు. బుధవారం భట్టిప్రోలు మండలం చింతమోటు, పెదలంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, వేమూరు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తండ్రి వరికూటి అశోక్‌బాబును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, పెసర్లంక, చింతమోటు సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు నన్నెపాముల చంటి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, న్యాయవాది చిలుమూరు రామ్మోహన్‌రావు, నన్నెపాముల శివకుమార్, గుజ్జర్లమూడి రాజు, శొంటి రాము, శొంటి జయకృష్ణ, యలవర్తి బుజ్జి, రావుల బుజ్జి, జంపాని రవి, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పరిశ్రమ పరిరక్షణకు వినతి




తహసీల్దార్ మునిలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**భట్టిప్రోలు:** చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించి పరిశ్రమ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం భట్టిప్రోలు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ ఐ.మునిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ల చట్టాన్ని అమలు పరచాలని, సొసైటీలకు రావాల్సిన రిబేటు, ఆప్కో బకాయిలు వెంటనే విడుదల చేయాలని, చేనేత కార్మికులకు రూ.2 లక్షల ముద్ర రుణాలు ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యన్నారాయణ, డి. సత్యన్నారాయణ, వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షులు బి నాగమల్లేశ్వరరావు, చేనేత, కౌలు రైతు సంఘం నాయకులు డి. కోటేశ్వరరావు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకలకు సర్వం సిద్ధం



పెనుమూడి రోడ్డులో విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న తూర్పు జామియా మసీదు



ఓల్డ్‌టౌన్‌లో విద్యుత్ దీప కాంతులతో తీర్చిదిద్దిన పెదజామియా మసీదు



కొల్లూరులో విద్యుత్ దీప కాంతుల్లో మసీదు

**రేపల్లె రూరల్:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణం, మండలంలో వేడుకలు నిర్వహించుకునేందుకు ముస్లిం సోదరులు సర్వం సిద్ధం చేశారు. గత నెల రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు నేటితో తీరనున్నాయి. పట్టణంలోని వివిధ మసీదులను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పెనుమూడి రోడ్డు తూర్పు జామియా మసీదు, పెద్ద పోస్టాఫీసు రోడ్డులోని పెద జామియా మసీదు, రామకోటిపేట మదీన మసీదు, లక్ష్మీ టాకీసు సెంటరులోని మర్కస్ మసీదు, నేతాజీనగర్‌లలోని నసీరుద్దీన్ మసీదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం ముస్లిం సోదరులు నమాజు నిర్వహించుకునేందుకు ఉయ్యూరువారిపాలెం రహదారిలోని ఈద్గాను సిద్ధం చేశారు.

**కొల్లూరు :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మసీదులు విద్యుత్ దీపాల అలంకరణతో ఆకర్షణీయంగా మారాయి. వేడుకల సందర్భంగా కొల్లూరులో మసీదును ముస్లిం సోదరులు విద్యుత్తు దీపాలతో అలంకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఉపవాస దీక్షలను బుధవారం సాయంత్రంతో విరమించి గురువారం ఉదయం మసీదులో నమాజ్ ముగించుకొని క్రాప రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## ప్రారంభమైన వసంత నవరాత్రులు

**భట్టిప్రోలు:** భట్టిప్రోలు శుక్రవారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 9 రోజుల పాటు (వసంత నవ రాత్రులు) శ్రీరామ, శ్రీ లలితా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు బూర్లె అరుణకుమారి తెలిపారు. గ్రామానికి చెందిన మానేపల్లి నాగభూషణం స్వగృహంలో బుధవారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. మద్దుల శ్రీనివాసరావు-సరస్వతి దంపతుల స్వగృహంలో తొలి పూజా కార్యక్రమం నిర్వహించారు. అరుణకుమారి మాట్లాడుతూ ఈ నవరాత్రుల్లో దుర్గాదేవిని 9 రూపాల్లో 9 రోజుల పాటు పూజ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.నళిని, కె.హేమలత, డి.శశికళ, టి.కన్యాకుమారి, వై.సూర్యప్రభ, టి.శ్రీవాణి, బి.ధనలక్ష్మి, టి. సుజాత, ఎం.శశికళ పాల్గొన్నారు.

## వేసవిలో గర్భిణులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి



కేంద్రంలో కోడి గుడ్లను పరిశీలిస్తున్న పద్మావతి

**కొల్లిపర:** వేసవిలో గర్భిణీలు, చిన్నారులు వైద్యులు, అంగన్‌వాడీ కేంద్రాలల్లో అధికారులు సూచిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తూ, ప్రతి నెల ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలోని హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం ప్రతి నెల అందిస్తున్న పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా అని గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యాలయాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను వినియెగించాలని అన్నారు. గర్భిణులు ఎక్కువగా ఆకు కూరలు, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గైర్హాజరయిన పిల్లల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డ్రాప్ అయిన పిల్లలపై దృష్టి పెట్టాలని విద్యాశాఖను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాల్మన్‌రాజు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.